మిర్చి రైతుకు నష్టాల ఘాటు



ఈ ఫొటోలోని మహిళా రైతు పేరు పార్వతమ్మ. కావలి రూరల్ మండలం అన్నగారిపాలెం పంచాయతీ పెద్దనట్టు గ్రామం. ఒకటిన్నర ఎకరాలో మిరప పంట సాగు చేసింది. సస్యరక్షణ చర్యలు తీసుకుంటూ మిరపను కాపాడుకుంటూ వచ్చింది. చెట్లకు కాయలు బాగా కాస్తున్నాయని సంతోష పడింది. ఇంతలో భారీ వర్షాలు కురవడంతో పొలాల్లో నీరు నిల్వ ఉండిపోయాయి. దీంతో ఆకు ముడత వైరస్ సోకింది. కాయ రంగు మారడం మొదలైంది. వ్యాపారులు అడుగుతున్న ధరలు కూడా చాలా తక్కువగా ఉండటంతో ఏమి చేయాలో తెలియక దిగులు పెట్టుకుంది.

- చేతికందిన పంట వర్షార్పణం
- నిండా మునిగిన మిర్చి రైతులు

వాణిజ్య పంటగా పేరొందిన మిరప సాగు అకాల వర్షాలకు నీట మునిగింది. ఫలితంగా మొక్కలు నీటిలో నానిపోవడంతో తెగుళ్ల బారిన పడింది. కాయలు కుళ్లి పోతుండడంతో మార్కెట్‌లో అమ్ముకునేందుకు ప్రయత్నించినా ఫలితం ఉండడం లేదు. దీంతో లాభాల పంట రైతులకు నష్టాల ఘాటు మిగిల్చింది.



తెగుళ్ల వల్ల వాలిపోయిన మొక్కలు

కావలి : నియోజకవర్గంలోని కావలి రూరల్ మండలంలో 1,500 ఎకరాల్లో, దగదర్తి మండలంలో 1,850 ఎకరాల్లో, బోగోలు మండలంలో 1,150 ఎకరాల్లో మిరప సాగు చేస్తారు. అయితే భారీ వర్షాలకు మిరప పంట సాగు చేస్తున్న రైతులకు తీవ్ర నష్టాలు మిగిల్చాయి. పంట చేతికందే సమయానికి మొక్కలు నీళ్లల్లో నానిపోవడంతో తెగుళ్లు సోకాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల వల్ల ఒకరకమైన నష్టం జరిగితే దానివల్ల సోకిన వైరస్‌లు మిర్చికి మరో రకమైన నష్టం జరిగింది.

చేలల్లో నిలిచిన నీరు

మిర్చి రైతుకు వర్షం రూపంలో పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. భారీ వర్షాల వల్ల తొలి కాపును రైతులు కోల్పోయారు. చేలల్లో నీరు నిలిచి మిరప పంట పాచిపట్టింది. పూత రాలిపోయి కాయలు కుళ్లిపోయి మొక్కలు వాలిపోయాయి. ఎండిపోతున్న మిరపను కాపాడుకునేందుకు వారు అష్టకష్టాలు పడుతున్నా ప్రయోజనం కనిపించడం లేదు. ఎకరాకు రూ.50 వేల నుంచి 60 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారు. వర్షాలు, వైరస్ కలిసి మిర్చి రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గి నెమ్ముశాతం పెరిగితే తెల్లదోమ వస్తుంది. వైరస్‌తో దెబ్బతిన్న మొక్కలు కోలుకుని పండే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.25 వేలు కౌలు చెల్లించి పైరు వేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చేతికందిన పంట నీటిపాలు కావడంపై దిగులు చెందుతున్నారు. గత సీజన్‌లో మిరప పంటకు తెగుళ్లు సోకడంతో దిగుబడులు తగ్గిపోయాయి. అసలే ఈ సీజన్‌లో అనేక సవాళ్లను ఎదుర్కొని మిర్చిపంటను సాగుచేసిన రైతులకు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. తెగుళ్లు, ఆకు ముడత పురుగు వల్ల మిర్చి పంటపై ఆశలు కోల్పోయి చేతికొచ్చిన కొద్దిపాటి పంటనూ అమ్ముకునేందుకు రైతులు సిద్ధమైన వేళ మిర్చి నాణ్యత లేకపోవడంతో వ్యాపారులు ధరలు తగ్గించి అడుగుతున్నారు. తోటలోనే రంగు మారిన మిర్చిని వ్యాపారులు తక్కువ ధరలకే కొనుగోలు చేస్తుండటంతో సాగుదారులు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోతున్నారు. దీంతో మిర్చి రైతులపై దెబ్బమీద దెబ్బ పడుతోంది. డిసెంబర్‌లో కోతలు ప్రారంభం కావాల్సి ఉండగా, సగం రంగు మారిన కాయలే వస్తుండటంతో రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. ఈ క్రమంలో అకాల వర్షాలు రైతులతో దెబ్బ మీద దెబ్బ పడింది.

పెట్టుబడి కూడా రాదు



మిరప పైరును వర్షం ముంచేసింది. ఎకరా సాగు చేస్తే, పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. చెట్లు బతికే పరిస్థితి లేదు. ఆకుముడత తెగులు సోకింది. దీని నుంచి పైరును కాపాడుకోలేం. పచ్చి మిర్చిని మార్కెట్‌కు తరలించడానికి కేజీ రూ.10లకు అడుగుతున్నారు. కనీసం వాటిని కోయడానికి కూలీ కూడా రాదు. అకాల వర్షాలు దారుణంగా దెబ్బకొట్టాయి.

– మోటిపల్లి అంజయ్య, మిరప రైతు, కొత్తసత్రం, తుమ్మలపెంట పంచాయతీ



పంటకు సోకిన ఆకు ముడత తెగులు

ప్రజా వ్యతిరేక విధానాలు వీడాలి



ఆత్మకూరులో నిరసన చేస్తున్న వామపక్ష నాయకులు



ఉదయగిరిలో..

ఆత్మకూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను వీడాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట వారు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. తొలుత మున్సిపల్ బస్టాండ్‌లోని అంబేడ్కర్ బొమ్మ వద్ద నుంచి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఆర్డీఓ పావనికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, పంటల మద్దతు ధరకు చట్టం చేయాలని, విద్యుత్ సవరణల బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని కోరారు. వామపక్ష నాయకులు డేవిడ్‌రాజు, లక్ష్మీపతి, నాగయ్య, శివప్రసాద్, హజరత్తయ్య, ఖాజారసూల్, నాగేంద్ర, గుల్జార్‌బేగం, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

- దుత్తలూరు : స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకులతో సీపీఎం మండల కార్యదర్శి గుజ్జుల మల్లికార్జున మంగళవారం సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని హితవు పలికారు. అనంతరం ఆటో యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, కార్యదర్శిగా కూరపాటి రఘును ఎన్నుకున్నారు. ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్, సీఐటీయూ మండల కార్యదర్శి నేలటూరి సింహాద్రి, అధ్యక్షుడు దాసరి ఓబుల్‌రెడ్డి, రైతుసంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.
- ఉదయగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం రైతు కార్మికులు, వ్యవసాయ కూలీలు ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సుభద్రకు అందజేశారు. బండగానిపల్లి ఎంపీటీసీ కాకు విజయమ్మ, నాయకులు కోడె రమణయ్య, రజియా, గడ్డం నాగేశ్వరరావు, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసులకు అవగాహన



మాట్లాడుతున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుకన్య

ఉదయగిరి : స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో పోలీసులకు అరెస్టు, రిమాండు, కోర్టులో ముద్దాయిల హాజరుపై అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.సుకన్య మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోషల్ మీడియా కేసుల విషయంలో పోలీసులు అనుసరించాల్సిన విధానాల గురించి వివరించారు. సీఐ వెంకట్రావు, ఎస్సైలు పాల్గొన్నారు.

మాగుంట సుబ్బరామిరెడ్డికి నివాళి



కావలి : మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి జయంతిని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు గుత్తికొండ కిశోర్, రాజ్‌కుమార్ చౌదరి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

దుత్తలూరు : భారీ వర్షాల నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వై.నాగరాజు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఏఓ ఎస్.వెంకటసుబ్బారెడ్డి, ఇరిగేషన్ ఏఈ వెంకటసుబ్బయ్య, ఎస్సై ఆదిలక్ష్మి, పాల్గొన్నారు.

- సంగం : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సోమ్లానాయక్ మంగళవారం సమావేశం నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ప్రజలను అప్రమత్తం చేయాలని వీఆర్‌ఓలను ఆదేశించారు.

ఎల్‌ఐసీ ఉద్యోగుల నిరసన

ఆత్మకూరు : సీఐటీయూ పిలుపు మేరకు ఎల్‌ఐసీ ఉద్యోగులు మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ప్రమాణాలు పాటించాలి

సీతారామపురం : సిమెంట్ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఎంపీడీఓ భాస్కర్, పీఆర్ ఏఈ తిరుమలయ్య సూచించారు. వారు మంగళవారం సీతారామపురంలోని రజక కాలనీలో రూ.15 లక్షల ఉపాధి నిధులతో వేస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. అసిస్టెంట్లు సుమతి, ప్రవీణ్ ఉన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



ఆత్మకూరు: రవాణా శాఖ కార్యాలయంలో..



ఆత్మకూరురూరల్ : బోయలచిరివెళ్లలో..



కావలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..



సోమశిల : వివిధ వేషధారణలో విద్యార్థులు



సంగం : తహసీల్దార్ కార్యాలయంలో..



చేజర్లలో..



మర్రిపాడులో..

ఆత్మకూరు : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఎంవీఐ బి.రాములు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో టీచర్లు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ డీఈఓ గోపాల్ పాల్గొని, రాజ్యాంగ విశిష్టతను వివరించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు డి.పద్మమ్మ, హైమావతి, భారతి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

- స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నం నాగరాజు, పి.మహేష్, కె.చందు, జి.శ్రీనివాసులు, సయ్యద్ రసూల్, అమీర్ పాల్గొన్నారు.
- కావలి : మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆదేశాలతో పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, గంధం ప్రసన్నాంజనేయులు, మండలి కృష్ణారావు, దామిశెట్టి సుధీర్ నాయుడు, గుడ్లూరు మాల్యాద్రి, కనుపర్తి రాజశేఖర్, షేక్.నాయబ్‌రసూల్, పరుసు మాల్యాద్రి, బుడంగుంట వెంకటేశ్వరరెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.
- ఆత్మకూరురూరల్ : మండలంలోని బోయలచిరివెళ్ల, మహిమలూరు, కరటంపాడు, మురగళ్ల, అప్పారావుపాళెం, నాగులపాడు తదితర పాఠశాలల్లో రాజ్యాంగంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.
- సోమశిల : అనంతసాగరం మండల పరిధిలోని చిలకలమర్రి జెడ్పీహైస్కూల్లో సోషల్ ఉపాధ్యాయిని మాధవి, పాతదేవరాయపల్లి ఎంపీయూపీ పాఠశాలలో హెచ్‌ఎం డానియల్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు దేశ నాయకుల వేషధారణలో అలరించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.
- సంగం : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సోమ్లానాయక్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీ ప్రసాద్, గ్రంథాలయంలో లైబ్రేరియన్ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.
- కావలి : పాతూరులోని పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. సోషల్ టీచర్ సరళకుమారి రాజ్యాంగ విశిష్టతను వివరించారు. ఉపాధ్యాయులు మధుసూదన్, దయాలత, ఎన్‌సీసీ అధికారి మస్తాన్‌వలీ, హవల్దార్ హరిదీప్‌సింగ్ పాల్గొన్నారు.
- చేజర్ల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి నివాళులర్పించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మస్తానయ్య రాజ్యాంగ విశిష్టతను వివరించారు. ఎంపీడీఓ విజయలలిత, ఏపీఎం సుజన పాల్గొన్నారు.
- మర్రిపాడు : మండలంలోని అన్ని పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు.
- ఉదయగిరి : స్థానిక ఎంజీఆర్ ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ గోపీకృష్ణ, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ నారాయణ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ కిరణ్, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలు, సచివాలయాల్లో ఉద్యోగులు అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు.
- వింజమూరు బంగ్లా సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి కన్జ్యూమర్ రైట్స్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వసంతరావు నివాళులర్పించారు. మాజీ సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, టీడీపీ నేతలు నరసారెడ్డి ఆనంద్ పాల్గొన్నారు.
- కలిగిరి : స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ నందిపోగు వెంగళరావు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నేతలు రొడ్డా హజరత్, మస్తాన్, మహేష్, సుధీర్, కార్తీక్, నవీన్, నరసింహ, రాజు పాల్గొన్నారు.
- అనుమసముద్రంపేట : స్థానిక ఠాగూర్ పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. రాజ్యాంగ విశిష్టతను వివరించారు.
- సీతారామపురం : మండలంలోని పలు పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.
- వరికుంటపాడు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీ నాగూర్‌వలీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఏపీఓ ఆజామ్‌ఖాన్, సహాయకులు కె.వెంకటాద్రి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.
- దుత్తలూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ యనమల నాగరాజు రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఏఓ ఎస్.వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ వెంగయ్య అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.



సీతారామపురంలో..



వింజమూరు గ్రంథాలయంలో..



దుత్తలూరు : తహసీల్దార్ కార్యాలయంలో..



కలిగిరిలో..

క్లుప్తంగా

ప్రజలకు విస్తృత వైద్యసేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్, సిబ్బంది

ఆత్మకూరు : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు విస్తృత వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమం రూపొందించినట్లు ఆత్మకూరు అర్బన్ వైద్యాధికారి డాక్టర్ అస్మా తెలిపారు. పట్టణంలోని యూపీహెచ్‌సీలో ఆమె మంగళవారం మాట్లాడారు. ఇక్కడ 24 గంటల వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. అనంతరం బైపాస్ రోడ్డులోని గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుధాకర్, ఎంపీహెచ్‌ఎస్ పార్వతి పాల్గొన్నారు.

రాజుపాళెంలో..

మర్రిపాడు : మండలంలోని రాజుపాళెం ప్రాథమిక పాఠశాలలో మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ ఆధ్వర్యంలో 104 వాహనం ద్వారా వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. సహాయకుడు నాగిరెడ్డి, ఏఎన్ఎం వేళాంగిణి, ఆశా కార్యకర్తలు ఉమారాణి, తిరుపతమ్మ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



కావలి : పట్టణంలోని ముసునూరు మర్రిచెట్టు వద్ద కొత్త గిరిజన కాలనీలో హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లను పంపిణీ చేశారు. కావలి ఏడీఏ నాగరాజు పాల్గొని, సంస్థ సేవలను అభినందించారు. షేక్.మీరా సాహెబ్ వర్ధంతి సందర్భంగా కుమారుడు మస్తాన్ సాహెబ్ దాతృత్వంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా సంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఘనిబాషా, లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



అల్లూరు : అవగాహన ర్యాలీలో అధికారులు

అల్లూరు : బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని సీడీపీఓ సౌజన్య అన్నారు. మండల పరిధిలోని చెర్లోసంఘంలో బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ రజనీకాంత్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

- సంగం : మండలంలోని జెండాదిబ్బ ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దువ్వూరు సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో సీడీపీఓ సునీలత ప్రజలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు డి.లీలమ్మ, ఎం.చెంచయ్య పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు రక్తమార్పిడి



కావలి : స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ డే కేర్ సెంటర్‌లో ముగ్గురు తలసేమియా బాధితులకు మంగళవారం రక్తమార్పిడి నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ రక్త కేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ కావలిలో తలసేమియా ఆస్పత్రిని ఏర్పాటు చేశామని, వ్యాధి లక్షణాలు ఉన్నవారు రావాలని కోరారు. రక్తమార్పిడి చేయించుకున్న ప్రభాకర్, మల్లికార్జున, సయ్యద్ రిహాన్‌లకు మందులతో పాటు పోషకాహారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తలసేమియా ఆస్పత్రి ప్రధాన దాత రమేష్‌రెడ్డి, వైద్యులు శ్రీధర్, రమ్య, డే కేర్ సెంటర్ నిర్వహణ కమిటీ కన్వీనర్ హరినారపరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన

వరికుంటపాడు : మండలంలోని ఆంధ్రావారిపల్లెలో పొగాకు రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ అధిక విస్తీర్ణంలో పంటను సాగు చేయవద్దన్నారు. ప్రత్యామ్నాయ పంటల వైపు కూడా దృష్టి సారించాలని కోరారు. ఐటీసీ మేనేజర్ వెంకటేష్, ఫీల్డ్ ఆఫీసర్ ఆదర్శ్‌జగన్నాథ్, కెనరా బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, వీపీఏ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బయోమెట్రిక్ తప్పనిసరి

సోమశిల : సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు ప్రకారం జీతాల చెల్లింపులు జరుగుతాయని, తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలని ఎంపీఈఓ ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. అనంతసాగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు ప్రజలను అప్రమత్తం చేస్తూ సచివాలయ సిబ్బందికి అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

స్థలం కేటాయించాలని వినతి



ఆత్మకూరు : అనంతసాగరంలోని గిరిజన కాలనీ వాసుల కోసం శ్మశాన స్థలం కేటాయించాలని పలువురు గిరిజనులు ఆత్మకూరు ఆర్డీఓ పావనికి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు సీపీఎం నాయకులు ఆమె కార్యాలయంలో మంగళవారం కలిసి విన్నవించుకున్నారు. పార్టీ నేతలు జి.లక్ష్మీపతి, షేక్.అన్వర్‌బాషా, మీరా మొహిద్దీన్, రహంతుల్లా, అంకయ్య, మస్తాన్, రవి పాల్గొన్నారు.

సూచనలు పాటించాలి

ఆత్మకూరురూరల్ : వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ దేవసేనమ్మ అన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లి, మురగళ్ల రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. ఉద్యాన శాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి, ఏఓ కిశోర్‌బాబు పలు సూచనలు చేశారు. వీపీఏ స్వప్న, ఎంపీఈఓ ఇంద్రాణి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ వద్ద వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సురేష్

కావలి : ఆర్థిక వివాదంలో పోలీసులు వేధిస్తున్నారని ఓ వ్యక్తి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడు సురేష్ కథనం మేరకు.. పట్టణంలోని ఓ ప్రైవేటు సంస్థలో సురేష్ బంగారం తాకట్టు పెట్టారు. దానికి సంబంధించి సదరు సంస్థ సిబ్బందితో తలెత్తిన వివాదానికి సంబంధించి కావలి వన్‌టౌన్ పోలీసులు మంగళవారం సురేష్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిచారు. ఈ క్రమంలో అతని పట్ల దురుసుగా ప్రవర్తించడంతో మనస్తాపం చెంది పోలీస్‌స్టేషన్ వద్దనే నిద్రమాత్రలు వేసుకున్నట్లు బాధితుడు తెలిపాడు. పోలీసులే తనను ఆటోలో ఆస్పత్రిలో చేర్చారని వివరించారు. తనకు న్యాయం జరగకపోతే కుటుంబంతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని వాపోయారు.

ఆర్థిక సాయం అందజేత



ఆత్మకూరు : పట్టణంలోని చావడి సెంటర్‌కు చెందిన షానవాజ్ ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ గంగాధర్, ఎస్సై షేక్.జిలాని మంగళవారం బాధిత కుటుంబీకులకు రూ.9 వేల ఆర్థిక సాయం అందించారు.

సైబర్ నేరాలపై సదస్సు



మాట్లాడుతున్న మేనేజర్ రామకృష్ణ

వింజమూరు(ఉదయగిరి) : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫీల్డ్ ఆఫీసర్ మధు పాల్గొన్నారు.

30న సర్వసభ్య సమావేశం

సంగం : మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షాలెట్ మంగళవారం తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, మండలాధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

మండల సమావేశం రేపు

సోమశిల : అనంతసాగరంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు.

దేవస్థానంలో పూజలు

వింజమూరు(ఉదయగిరి) : స్థానిక వింజేటమ్మ దేవస్థానంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉసిరి మొక్క నాటారు.

గ్రామాల్లో మోస్తరు వర్షాలు

చేజర్ల : మండలంలోని అన్ని ప్రాంతాల్లో మంగళవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని, రైతులు వరినాట్లు వేసుకోవద్దని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

- అల్లూరు : మండల వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి మోస్తరు వర్షం కురిసింది. వర్ష ప్రభావంతో పాటు చలితీవ్రత పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.